క్వార్టర్ బాటిల్‌పై
రూ. 15--30 అదనపు వసూళ్లు..?




www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

తెలంగాణ హైకోర్టులో
5 ఏళ్ల పోరాటానికి విజయం




హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 184, బుధవారం 5-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వెల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

## ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు

# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

### ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్న సీఎం - మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్లనున్న ముఖ్యమంత్రి**



**హైదరాబాద్, ఆగస్టు 4 :**

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణ సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది. ఇవాళ రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. రేపు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు.

ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు : తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడం, క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపట్టనున్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన చేయనున్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు, అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం : ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు.

ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో చర్చలు : యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. తెలంగాణలో ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమై పరస్పర అవగాహన ఒప్పందాలు (వీశీఖ) కుదుర్చుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, మరిన్ని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు జరగనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే

..మిగతా 2లో




### బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం

# ఒక అలవాటు

**అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?:**

**మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు**

**బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ**

**మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు**

**జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్**

**పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్**

**తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఆగస్టు 4**

బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### హిట్లర్ ఆదర్శంతో రేవంత్ రెడ్డి

# హైడ్రాను తెచ్చారు

**హైడ్రా అనేది పేదలను భయభ్రాంతులకు గురి చేసే సంస్థ అన్న ఈటల**

**పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని మండిపాటు**

**కోర్టుల ఆదేశాలను కూడా హైడ్రా లెక్కచేయడం లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఆగస్టు 4**



'హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను

..మిగతా 2లో

# క్షుద్రపూజల వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం



## అద్దంకి, రామ్మోహన్‌కు హరీశ్ లీగల్ నోటీసులు..

**హైదరాబాద్, ఆగస్టు 4 :**

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌కు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం లీగల్ నోటీసులు పంపారు. రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, కరువు రావాలనే ఉద్దేశంతో దేవాలయాలకు వెళ్లి క్షుద్రపూజలు, తాంత్రిక పూజలు చేశారంటూ తనపై ఇద్దరు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల్లో తన పేరు ప్రతిష్ఠలను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేశారని లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. మొక్కులు తీర్చుకొనేందుకు గుడికి వెళ్లడం మన సంప్రదాయమని, అలా భక్తిశ్రద్ధలతో గుడికి వెళ్తే ఆ విషయాన్ని సైతం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి వాడుకోవడం కాంగ్రెస్ నేతల సంకుచిత బుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమేనని నోటీసుల్లో పేర్కొన్నారు.

**ప్రశ్నిస్తున్నందుకే..**

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్

..మిగతా 2లో

# లైంగిక దాడి ఆరోపణలు

## హైకోర్టులో రేగా కాంతారావు పిటిషన్

**తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే**

**ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి లైంగిక దాడి చేసి, రూ. 5 లక్షలు తీసుకున్నారని యువతి ఫిర్యాదు**

**ఈ ఆరోపణలు అవాస్తవమని, తన ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని కాంతారావు వాదన**

**నాలుగేళ్ల నాటి ఘటనపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమన్న మాజీ ఎమ్మెల్యే**



**హైదరాబాద్, ఆగస్టు 4 :**

తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లైంగిక దాడి, మోసం ఆరోపణలతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఉద్యోగం ఇప్పిస్తానని, టీవీ ఛానల్ ఏర్పాటుకు సహకరిస్తానని నమ్మించి రేగా కాంతారావు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా,

..మిగతా 2లో



### విద్య పట్ల కనీస

# చిత్తశుద్ధి లేని వ్యక్తి రేవంత్

**నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?: ధర్మపురి అరవింద్ సవాల్**

**ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్**

**రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఆగస్టు 4 :**

ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం

..మిగతా 2లో



## హైదరాబాద్‌కు

# భారీ వర్ష సూచన

### ఎల్లో అలర్ట్ జారీ

2లో..

**వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు**

**హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు**

## ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు

# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**మొదటి పేజీ తరువాయి...**

స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటైన నేపథ్యంలో, అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థలను తెలంగాణకు తీసుకురావడంపై కూడా ఈ పర్యటనలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక శిక్షణ అందించే విధంగా విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

క్రీడాభివృద్ధికి కొత్త ప్రణాళికలు : తెలంగాణ యువత ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలని రేవంత్ రెడ్డి పలు మార్లు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూకే, అమెరికాలోని ప్రముఖ క్రీడా అకాడమీలు, శిక్షణా కేంద్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతులు, శిక్షణా వ్యవస్థలను అభివృద్ధి చేసే అంశాలపై నిపుణులతో చర్చించే అవకాశముంది.



పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాల్లో తెలంగాణకు ప్రపంచస్థాయి భాగస్వామ్యాలను

తెలంగాణ అభివృద్ధికి కొత్త అవకాశాలు : ఈ విదేశీ తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల సహకారం, ఆధునిక శిక్షణా విధానాల అమలు ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు తెలంగాణను విద్యా, నైపుణ్యాలు, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన కీలకంగా మారే అవకాశం ఉంది.

పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలి: సీఎం

పోలీసు ఉద్యోగాల భర్తీపై ఇంటెలిజెన్స్ వర్గాలు సీఎంకు కీలక సమాచారం ఇచ్చారు. నియామక ప్రక్రియకు అడ్డుకోవాలని కొన్ని పార్టీలు చూస్తున్నట్లు సమాచారం. "పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలి. నియమ నిబంధనలను అనుసరించి లోపాలు లేకుండా చూడాలి. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాలో అప్రమత్తంగా ఉండాలి. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. నియామక పరీక్షల నిర్వహణపై దుష్ప్రచారం అరికట్టాలి." సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, ఆగస్టు 4:**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు – వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బోర్డు ఏర్పాటు నిమిత్తం తీసుకువచ్చిన చట్ట సవరణతో పాటు బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వంతో పాటు ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకూ నోటీసులు జారీ చేసింది. ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చు : దేవాదాయ శాఖ చట్టానికి సవరణ తీసుకువస్తూ చేర్చిన సెక్షన్లు 96, 97లతో పాటు ఆలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 30న జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నాగిళ్ల శ్రీనివాస్, వ్యవస్థాపక ట్రస్టీ నరసింహ మూర్తిలు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.100 కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చని, అందులో ఎమ్మెల్యేతోపాటు వంశపారంపర్య ధర్మకర్త తదితరులు సభ్యులుగా ఉంటారని పేర్కొందని, ఇది చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రకారం వంశపారంపర్య ధర్మకర్త ఉన్నపుడు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తే దానికి చైర్మన్‌గా వంశపారంపర్య దర్మకర్తనే నియమించాలని స్పష్టంగా ఉ




ఒదన్నారు. వారికి ప్రత్యేక హక్కును కల్పించిందన్నారు. వ్యవస్థాపక ట్రస్టీకి ఉన్న ప్రత్యేక హోదాను తగ్గించి కేవలం ఒక సభ్యుడిగా మాత్రమే నియమించారన్నారు. అంతేగాకుండా రాజ్యాంగంలోని అధికరణ 24, 25 ప్రకారం ఆలయ బోర్డులో ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ఆలయ నిత్య కైంకర్యాలు, పూజావిధానాలు, ఉత్సవాలు, ఆగమ సంప్రదాయాల నిర్వహణ వంటి అత్యంత కీలక బాధ్యతలను అప్పగించిందన్నారు. పలువురికి నోటీసులు జారీ : ఇవి కేవలం పరిపాలనాపరమైన అంశాలే కాకుండా మతపరమైనవని, అందువల్ల ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంతో హిందూ మత సంస్థలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం సీఎస్, దేవాదాయశాఖ కమిషనర్, ఆలయ ఈవో, చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు-అదనపు ఛార్జిషీట్‌కు సిద్ధమవుతున్న సిట్

**హైదరాబాద్, ఆగస్టు 4 :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు – ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం

తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఛార్జిషీట్‌కు సిట్ సిద్ధమవుతోంది. ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు చేస్తోంది. నేతల పేర్లు చేర్చాలా వద్దా అనే అంశంపై న్యాయసలహాలు తీసుకుంటున్నారు. ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు 600 మంది వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. 600 మంది స్టేట్‌మెంట్ల ఆధారంగా అదనపు ఛార్జిషీట్ సిద్ధం చేస్తున్నారు. ఆ 15 రోజుల్లో 4013 మందిపై నిఘా : ముగ్గురినీ నిందితులుగా చేర్చే విషయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం పెద్దఎత్తున కసరత్తు చేసినట్లుగా సమాచారం. కీలక సాక్ష్యాధారాల సేకరణ క్రమంలో వందలమంది వాంగ్మూలాలను అధికారులు సేకరించారు. 2023 నవంబరు 15 నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా జరిగినట్లుగా చెబుతున్న ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంపైనే కీలక దృష్టి సారించారు. ఆ 15 రోజుల్లో 4013 మందిపై నిఘా ఉంచినట్లుగా ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తులో తేలింది. వారిలో 618 మందికి సంబంధించిన ఫోన్ సంభాషణల్ని అక్రమంగా విన్నట్లుగా గుర్తించారు. ఆ వివరాలను ముందుంచుకుని కేసు ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ సీవోవో టి.ప్రభాకర్‌రావును విచారించింది. అయితే ఆయన పోలీస్ ఉన్నతాధికారులపైనే నెపం నెట్టేసినట్లు సమాచారం. వారి ఆదేశాల మేరకే తాను పనిచేశానని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును కొలిక్కి తెచ్చేందుకు ఓ మాజీ డీజీపీతో పాటు గత ప్రభుత్వంలో నిఘా విభాగంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి వాంగ్మూలాలను కూడా ఇటీవల సిట్ సేకరించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో సీఎంవోలో(ముఖ్యమంత్రి కార్యాలయం), హోంశాఖలో పనిచేసిన ఉన్నతాధికారుల నుంచీ వాంగ్మూలాలు తీసుకుంది. ఆయా అంశాలన్నిటినీ క్రోడీకరించడంతో పాటు దర్యాప్తులో తేలిన సమాచారం ఆధారంగానే బీఆర్ఎస్ ముఖ్యుల్ని నిందితులుగా చేర్చుతూ అనుబంధ అభియోగపత్రాన్ని రూపొందించినట్లుగా తెలుస్తోంది. ఒక్కొక్కరి పాత్రపై ఆధారాలు ఒకరికి మినహాయింపు : తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఆ ముగ్గురు నాయకుల పాత్ర ఏమిటనేది అభియోగపత్రంలో సిట్ కూలంకషంగా పొందుపరిచినట్లు సమాచారం. ప్రభాకర్‌రావు నియామకంలోనే మతలబు దాగి ఉందని మొదటి నుంచీ అనుమానిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం, ఆ దిశగా దర్యాప్తు చేసి వీరిలోని ఓ ప్రముఖుడి పాత్రను నిగ్గు తేల్చినట్లు సమాచారం. అలాగే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో మరొకరిని ఎవరిపై అక్రమంగా నిఘా ఉంచాలనే విషయంపై ఆదేశాలివ్వడంలో ఇంకొకరి పాత్రపై ఆధారాలను సేకరించినట్లు సమాచారం. వీరితోపాటు మరో కీలక మాజీ ప్రజాప్రతినిధినీ గతంలో విచారించినప్పటికీ ఆయన పేరును మాత్రం అభియోగపత్రంలో చేర్చలేదని తెలిసింది.

## ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ కన్నుమూత- సినీ ప్రముఖుల సంతాపం

**హైదరాబాద్, ఆగస్టు 4:**

గుండెపోటుతో కన్నుమూసిన ప్రదీప్ సింగ్ రావత్– సోషల్ మీడియాలో సంతాపం తెలిపిన అనేక మంది ప్రముఖులు ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) తుదిశ్వాస విడిచారు. ముంబయిలోని నివాసంలో గుండెపోటుతో ఆయన మంగళవారం కన్నుమూశారు. తన నటనతో ఇప్పటికే మంచి క్రేజ్ సొంతం చేసుకున్న ప్రదీప్ సింగ్ రావత్ మరణం పట్ల అనేక మంది సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.



**ప్రదీప్ సింగ్ సినీ జర్నీ**

1952లో దిల్లీలో జన్మించిన ప్రదీప్ సింగ్ రావత్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళతోపాటు ఇతర భాషల్లో యాక్ట్ చేశారు. అలాగే కొన్ని దూరదర్శన్ టీవీ సీరియల్స్‌లో కూడా నటించారు. కెరీర్ తొలి రోజుల్లో ఎక్కువగా విలన్‌గా నటించిన ప్రదీప్ రావత్, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా చేశారు. 1985లోనే ప్రదీప్ రావత్ సినీ ప్రయాణం మొదలైంది. బాలీవుడ్‌లో రాజ్ బబ్బర్ ఐత్ బార్ సినిమాలో తొలిసారి ఓ చిన్న పాత్రలో కనిపించారు ప్రదీప్ రావత్.

ఆ తర్వాత చాలా సినిమాల్లో నటిస్తూ వచ్చినా అక్కడ అనుకున్న రేంజ్‌లో పేరు సంపాదించలేకపోయారు. కొన్ని సినిమాల్లో మాత్రమే ఆడియన్స్‌కు గుర్తుండిపోయే రోల్స్ దక్కాయి. తెలుగులో నితిన్ – రాజమౌళి సై (2004) మూవీతో ఆయన టాలీవుడ్ జర్నీ ప్రారంభమైంది. భిక్షూ యాదవ్‌గా ఆయన పండించిన విలనిజానికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ తర్వాత వరుసగా తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారు.

భద్ర, అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్, దేశముదురు, యోగి, జగడం, గజిని, మస్కా, ఓయ్, రెబల్, నాయక్, బాద్షా, వన్ నేనొక్కడినే, అల్లుడు శీను, నేను శైలజ, సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి, జై లవ కుశ, వాల్తేరు వీరయ్య తదితర టాలీవుడ్ సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా 2026 మే 1వ తేదీన రిలీజ్ అయిన గాయపడ్డ సింహం మూవీలో కనిపించారు. అయితే తన కెరీర్‌లో ఫిల్మ్ ఫేర్ బెస్ట్ విలన్, సంతోషం బెస్ట్ విలన్, నంది అవార్డులు అందుకున్నారు ప్రదీప్ సింగ్ రావత్.



# క్షుద్రపూజల వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి...**

విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షగట్టి బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయే వార్తా చానళ్లు, ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ ఆరోపణలు చేశారో అవే మాధ్యమాల ద్వారా బహిరంగ క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసుల్లో డిమాండ్ చేశారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ప్రెస్ ఆర్కైవ్స్, ఇతర డిజిటల్, ప్రింట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి ఈ తప్పుడు వీడియోల పోస్టులను తొలగించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా క్షమాపణ చెప్పకపోయినా, వీడియోలు డిలీట్ చేయకపోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయస్థానంలో సివిల్, క్రిమినల్, పరువు నష్టం దావాలు వేయాల్సి వస్తుందని తేల్చిచెప్పారు.

## హిట్లర్ ఆదర్శంతో రేవంత్ రెడ్డి

# హైడ్రాను తెచ్చారు

**మొదటి పేజీ తరువాయి...**

ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన బడా బాబులకు భూములు కట్టబెట్టడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని ఈటల విమర్శించారు. ప్రస్తుతం నగరంలో హైడ్రా భయంతో ఇల్లు కొనడానికి కూడా ప్రజలు జంకుతున్నారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్, హోం శాఖల కంటే హైడ్రా ఒక సుప్రీం శాఖలా వ్యవహరిస్తోందని, ఆఖరికి కోర్టుల ఆదేశాలను కూడా లెక్క చేయడం లేదని ధ్వజమెత్తారు. అసలు ఈ సంస్థ సీఎం రేవంత్ రెడ్డి మాటైనా వింటుందో లేదో అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు.

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, ఆగస్టు 4 :**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# లైంగిక దాడి ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి...**

తన వద్ద నుంచి రూ.5 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ ఆరోపణలను రేగా కాంతారావు తన పిటిషన్‌లో తోసిపుచ్చారు. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తప్పుడు కేసు బనాయించారని ఆయన పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఘటనలపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమని, అందువల్ల ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఆయన కోర్టును కోరారు. ఈ పిటిషన్ ఆగస్టు 5వ తేదీన జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి రేవంత్

**మొదటి పేజీ తరువాయి...**

వ్యక్తం చేశారు. విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# నేరానికి పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్):** ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం తండాలో ఇటీవల జరిగిన ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ కేసును ఏన్కూర్ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన బంగారు పుస్తెలతాడును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులు భూక్య హర్షవర్ధన్, శ్రీరాంపురం తండా, ఏన్కూర్ మండలం మరియు బానోత్ కిషోర్ కొత్త తండా, టేకులపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నివాసులు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని ౹జూబీ సంస్థలో ఉద్యోగాలు చేస్తూ ఒకే చోట నివాసం ఉంటున్నారు. దర్యాప్తులో నిందితులు తెలిపిన వివరాల ప్రకారం, భూక్య హర్షవర్ధన్ స్నేహితుల దగ్గర సుమారు రూ.1 లక్ష మేర అప్పులు చేశాడు. ౹జూబీలో వచ్చే జీతం ఆ అప్పులు తీర్చడానికి సరిపోకపోవడంతో పాటు, కుటుంబ సభ్యులు కూడా అదనపు డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తులు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ఎలాగైనా త్వరగా డబ్బు సంపాదించి అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తనతో కలిసి హైదరాబాద్‌లో పనిచేస్తున్న దూరపు బంధువు బానోత్ కిషోర్కు తన అప్పుల విషయం వివరించాడు. తేదీ 31-07-2026న కొత్తగూడెంలోని సెంట్రల్ పార్క్ వద్ద ఇద్దరూ కలుసుకుని సాయంత్రం వరకు కలిసి తిరిగారు. అనంతరం ఏన్కూర్ మండలం తిమ్మరపేట గ్రామానికి వచ్చి ఒక బెల్ట్ షాపులో మూడు బీర్లు కొనుగోలు చేసి గ్రామ శ్మశానవాటికలో కూర్చొని మద్యం సేవించారు. మద్యం సేవిస్తున్న సమయంలో హర్షవర్ధన్ తనకు ఉన్న అప్పుల గురించి కిషోర్‌కు వివరించి, వాటిని తీర్చుకోవడానికి ఇంట్లో ఉన్న బంగారం దొంగతనం చేయాలని ప్రతిపాదించాడు. మొదట తన నానమ్మ నాగమ్మ మెడలో ఉన్న బంగారు చైన్ దొంగతనం చేద్దామని భావించినప్పటికీ, కుటుంబ సభ్యులకు తనపై అనుమానం వస్తుందని భావించి ఆ ఆలోచనను విరమించుకున్నాడు. అనంతరం తన పెద్దతాత తావూరియా భార్య సాంఖలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును దొంగతనం చేయాలని ఇద్దరూ ముందస్తుగా ప్రణాళిక రూపొందించారు. దొంగతనం చేసిన బంగారాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ విక్రయించి వచ్చిన డబ్బుతో ముందుగా హర్షవర్ధన్ అప్పులు తీర్చుకుని, మిగిలిన మొత్తాన్ని ఇద్దరూ పంచుకోవాలని నిర్ణయించుకున్నారు.

ప్రణాళిక ప్రకారం అదే రోజు అర్ధరాత్రి సుమారు 12.00 గంటలకు హర్షవర్ధన్ తన గ్రామానికి కిషోర్‌ను తీసుకెళ్లి, ఇంట్లోకి ప్రవేశించే మార్గాన్ని చూపించాడు. ముందుగా ఇంట్లో ఉన్నవారంతా గాఢ నిద్రలో ఉన్నారో లేదో నిర్ధారించుకున్నారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్రధాన రోడ్డుపై ఉన్న వీధి విద్యుత్ దీపాన్ని ఆఫ్ చేయాలని హర్షవర్ధన్ కిషోర్‌కు చెప్పగా, కిషోర్ వెళ్లి వీధి లైట్ ఆఫ్ చేసి తిరిగి వచ్చాడు.

ఆ తరువాత ఇద్దరూ కలిసి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోని బాత్రూమ్‌లో ఉన్న బ్లేడ్‌ను తీసుకున్న హర్షవర్ధన్, నిద్రిస్తున్న సాంఖలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును బ్లేడ్‌తో కట్ చేసి అపహరించాడు. ఆమె కదలిక గమనించగానే ఇద్దరూ వెంటనే అక్కడి నుంచి పరుగెత్తి గ్రామం బయటకు వెళ్లిపోయారు.

చోరీ చేసిన బంగారు పుస్తెలతాడును వెంటనే అమ్మితే అనుమానం వస్తుందని భావించి, కొద్ది రోజులు హర్షవర్ధన్ తన వద్దే దాచుకున్నాడు. అనంతరం హైదరాబాద్ వెళ్లి అక్కడ విక్రయించి డబ్బును పంచుకోవాలని నిర్ణయించారు.

కేసు నమోదు అనంతరం ఏన్కూర్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ రోజు అనగా 04-08-2026 ఉదయం ఏన్కూర్ పోలీసులు తూతిక్కలింగన్నపేట బ్రిడ్జి సెంటర్ వద్ద ఇద్దరు యువకులను




అదుపులోకి తీసుకుని విచారించి నిందితుల నుండి బంగారం స్వాధీనం చేసుకుని వారిని కోర్ట్ నందు హాజరు పరచడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ కల్లూరు వసుంధర యాదవ్ మాట్లాడుతూ అప్పుల ఒత్తిడి యువతను నేరాల వైపు నెడుతున్నాయని, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన ఏన్కూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీమతి ఎన్. సంధ్య ని మరియు నిందితులను గుర్తించి వారిని అరెస్ట్ల చేయడం లో చాకచక్యంగా వ్యవహరించిన HC శ్రీహరి,కానిస్టేబుల్ రాజా, దేవేంద్ర, రవి, శంకర్, వినయ్ మరియు హోమ్ గార్డ్ రాము లను ఏసీపీవసుంధర యాదవ్ అభినందించారు.

# ఘనంగా ఖమ్మంలో హెచ్ఆర్సిసిఐ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్):** మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఖమ్మం జిల్లా నూతన కార్యాలయం జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్, సెక్రటరీ చింతల రవి, అధ్యక్షతన ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ ఇద్దరు ఇల్లందు రోడ్డు వద్ద ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్ఆర్సీసీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సింగమల వెంకటరమణయ్య గారు హాజరై వారి చేతుల మీదుగా మంగళవారం కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది,ఈ కార్యక్రమానికి హెచ్ఆర్సీసిఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్, వర్కింగ్ చైర్మన్ బెస్త సంజీవరావు, జనరల్ సెక్రటరీ మోటపోతుల బాబురావు, రాష్ట్ర మహిళా చైర్మన్ పాదం అజంతా, సెక్రెటరీ సంకా గణేష్ కుమార్, హాజరై మాట్లాడారు, అనంతరం సంస్థ ఫౌండర్ రమణయ్య మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో హ్యూమన్ రైట్స్ కార్యాలయాన్ని భారీ ఎత్తున ప్రారంభించినందుకు కమిటీ సభ్యులతో సంతోషం వ్యక్తం పరిచారు, సంస్థలో చేరదలిచే వారు లాభార్జన కోసం కాదని సేవ చేసే గుణం ఉంటేనే కమిటీ సభ్యులుగా చేరాలని అన్నారు, సంస్థ యొక్క నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, విధివిధానాలను గూర్చి క్లుప్తంగా వివరించారు, ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు చైర్మన్ పుచ్చకాయల దేవేందర్, జనరల్ సెక్రటరీ చింతల రవి, చిలకబత్తిన కనకయ్య, సయ్యద్ షారుక్ ఇమ్రాన్, కొప్పుల రామకృష్ణ వర ప్రసాద్, గుర్రం మనోజ్, నవీన్, నాగేశ్వరరావు, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, ఈ కార్యక్రమంలో బొమ్మల శంకర్, అవినాష్, సుధాకర్,ఈ కార్యక్రమ నిర్వాహకులు

# ఆధ్యాత్మిక వెలుగులతో 2వసంతంలోనికి నంద్యాల బిషప్ రెవరెండ్ డాక్టర్ కే సంతోష్ ప్రసన్న రావు

- **తమదైన ప్రత్యేక శైలితో ప్రార్థనా మందిరాల అభివృద్ధి**
- **నేడు అంగరంగ వైభవంగా వార్షికోత్సవ సంబరాలు**
- **హాజరుకానున్న రాష్ట్ర మంత్రి ఎండి ఫరూక్ , డాక్టర్ రేవ ప్రిస్కిల్లా రూ బెన్ మార్క్, రాయలసీమ బిషప్ డాక్టర్ పి ఐ జక్ వరప్రసాదరావు**

**నంద్యాల, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్):** లోక రక్షకుడైన ఏసుప్రభు చూపిన మార్గంలో నంద్యాల సి.ఎస్.ఐ డయాసిస్ లో ఆధ్యాత్మిక వెలుగులు పంచుతూ... తమదైన ప్రత్యేక శైలితో నంద్యాల పీఠాధిపతి డాక్టర్ రేవ కె సంతోష్ ప్రసన్న రావు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. నూతన వరవడితో ప్రార్థనా మందిరాలను అభివృద్ధి చేస్తూ, ప్రజా ఉపయోగ నిర్మాణాలను చేపట్టి పీఠాధిపతి రేవ రెండు డాక్టర్ కె సంతోష్ ప్రసన్న రావు రెండో వసంతంలోనికి తమ ఆధ్యాత్మిక గమనాన్ని కొనసాగిస్తున్నారు. సామ్యుడిగా, అందరినీ కలుపుకొని పోయి విశాల దృక్పథం గల మత గురువు ప్రసన్న రావు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలు విశ్వాసుల్లో చైతన్యాన్ని నింపుతున్నాయి. బిషప్ డాక్టర్ రెవరెండ్ కే సంతోష్ ప్రసన్న రావు తాను నంద్యాల డయాసిస్ లో పీఠాధిపతిగా అయినా సంవత్సరకాలంలోనే ఊహించలేని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ఆధ్యాత్మిక నిర్మాణాలను పూర్తిచేసి అందరి చేత ప్రశంసలు





అందుకుంటున్నారు. నంద్యాల అధ్యక్ష మండల పరిధిలో ఒక ఏడాదిలో 18 ఆధ్యాత్మిక నిర్మాణాలకు పునాది రాళ్లు వేసి వీటిలో 10 ప్రార్థన మందిరాలను పూర్తి చేసి ఆధ్యాత్మిక సేవలు కొనసాగిలా చురుకుగా కృషి చేశారు. వీటితోపాటు 2మత గురువుల గృహాలు అదితి గృహం, సండే స్కూల్, షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానున్నాయి. ఒక సంవత్సరం కాలంలోనే అద్వితీయంగా నిర్ణయాలు తీసుకొని ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణాలను సత్వరమే పూర్తిచేసి ప్రారంభోత్సవాలు నిర్వహించటం బిషప్ ఆధ్యాత్మిక సేవలు పట్ల సర్వత్ర అభినందనలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మొదటి ఆధ్యాత్మిక వసంతాన్ని సంపూర్ణంగా విజయవంతం చేసి బిషప్ డాక్టర్ రెవరెండ్ కే సంతోష్ ప్రసన్న రావు బుధవారం మొదటి వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బిషప్ రెవరెండ్





డాక్టర్ కె సంతోష్ ప్రసన్న రావు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదర్శంగా నిలుస్తున్నాయి. నంద్యాల డైసిస్ లోని ఎగ్జిక్యూటివ్ కమిటీ, డైసిస్ పరిధిలోని నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప, అనంతపురం, తెలంగాణ రాష్ట్రంలో జోగులమ్మ గద్వాల జిల్లాల మత గురువులు, విశ్వాసులు, బిషప్ కురెవరెండ్ డాక్టర్ కే సంతోష్ ప్రసన్న రావు కు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. విశాల దృక్పథంతో దైవ సేవలు అందించేందుకు ఆయన సతీమణి జాస్మిన్ బ్యుల, కుమారులు డానియల్, న్యూ ఎల్ పురుషోత్తం, తల్లిదండ్రులు సీయోను పురుషోత్తం, పరిపూర్ణమ్మ, ఐదుగురు సోదరీమణులు వెన్నుదన్నుగా బిషప్ ను మహోన్నత స్థానంలో నిలిపేలా కృషి చేస్తున్నారు.

**నేడు నంద్యాల బిషప్ డాక్టర్ రెవరెండ్ కె సంతోష్ ప్రసన్న రావు వార్షికోత్సవ సంబరం**

నంద్యాల పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించి తొలి వసంతం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా బుధవారం నంద్యాలలోని హోలీ క్రాస్ చర్చి లో తొలి వసంత వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్న హాలు పూర్తి చేశారు. ఈ వేడుకకు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండి ఫరూక్, సి నాట్ మోడరేటర్ సతీమణి రెవరెండ్ డాక్టర్ ప్రిస్కిల రూబెన్ మార్క్, రాయలసీమ బిషప్ రేవ రెండు డాక్టర్ ఐజక్ వరప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వీరితోపాటు సి నాట్ ఉమెన్ ఫెలోషిప్ బాధ్యులు భారతి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, కమిషనర్, బండి శేషన్న హాజరవుతున్నారు. ఈ వేడుకలకు రేవ రాజేంద్ర బాబు, ప్రభుదాస్, రెవరెండ్ డాక్టర్ నందం ఇసాక్, ఎం స్టీవెన్, బండి సామెల్ లా పర్యవేక్షణలో నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి విజయవంతం చేసేందుకు సన్న హాలు పూర్తి చేశారు. ఈ వేడుకలకు నంద్యాల ప్రొద్దుటూరు, గుంతకల్లు, నటికూడి, బాదవల్, కలసపాడు, గిద్దలూరు, అల్లగాడు, నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప, అనంతపురం, తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల ప్రాంతాల నుంచి 85 పాస్టేట్లు లోని 102 మంది పాస్టర్లు, 8 మిషనరీలు , 10 సువార్తికులు, 4 బైబిల్ అమ్మగారితోపాటు పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరవుతున్నారు.

# అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న యాజమాన్యంపై కేసు నమోదు : ఇన్స్పెక్టర్ బాలకృష్ణ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్):**ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్స్ లో ప్రదర్శన చెల్లుబాటు అయ్యే ఎలాంటి అనుమతి లేకుండా "ఎస్.కె. ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్" పేరుతో ప్రదర్శనను నిర్వహిస్తున్న నిర్వాహకుడు గరిమెల్ల జానకి రామయ్య పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. సెక్టార్ డ్యూటీ పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ పి. వెంకటేష్ కు అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు పెవిలియన్ గ్రౌండ్‌లో గరిమెల్ల జానకి రామయ్య అనే వ్యక్తి, సంబంధిత అధికారుల నుండి అనుమతి ఉందని తప్పుడు ప్రచారం చేస్తూ... "ఎస్.కె. ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్" పేరుతో ఒక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి, ప్రదర్శన నిలిపివేసినట్లు తెలిపారు.

# కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

- పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారానికి ఆదేశాలు
- ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్‌పై దృష్టి



**కారేపల్లి, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్ రాములు ):**ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసింగ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ శాఖ పనితీరు మరింత మెరుగుపడేందుకు అవసరమైన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఏసీపీ తిరుపతి రెడ్డి, కారేపల్లి సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ గోపి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టులో 5 ఏళ్ల పోరాటానికి విజయం

**-- మాజీ సింగరేణి జూనియర్ పంచాయతీ కార్యదర్శి మురళికి మళ్లీ పోస్టింగ్**




**కామేపల్లి,ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్):-** సింగరేణి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ 2020లో విధుల నుంచి తొలగింపునకు గురైన.కామేపల్లి గ్రామానికి చెందిన ఎం.మురళి సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత మళ్లీ తన ఉద్యోగాన్ని సాధించారు.ఈ వ్యవహారం పై మురళి దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన తెలంగాణ హైకోర్టు.. అప్పటి కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్ ఇచ్చిన తొలగింపు ఉత్తర్వులను పక్కనపెట్టి మురళిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తీర్పునిచ్చింది.హైకోర్టు ఆదేశాల మేరకు స్పందించిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఎం. మురళిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ గ్రామ పంచాయతీ జూనియర్ సెక్రటరీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఐదేళ్ల తర్వాత న్యాయం గెలిచి మళ్లీ విధుల్లో చేరుతుండటంతో మురళి తన ఆనందంను మంగళవారం వ్యక్తం చేశారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ వెంకన్న ను ఆర్థిక సహాయం

- ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు



**కామేపల్లి,ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి గ్రామ నివాసి మాలపోలు వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితి బాగాలేక ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న వారిని గుర్తించి కామేపల్లి క్రాస్ రోడ్ లో నిర్మించుకున్న ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యుడు అయిన మాలపోలు వెంకన్న ఆరోగ్య పరిస్థితి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వెంటనే కామేపల్లి క్రాస్ రోడ్ యందు నిర్మించుకున్న ఆటోడ్రైవర్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శులు సంఘ సభ్యులు కలిసి తమ వంతు ఖమ్మం హాస్పటల్లో ట్రీట్మెంట్ పొందుతున్న వెంకన్నకు తనకు మేమున్నామంటూ చెపుతూ మనోధైర్యాన్ని కల్పించి తమ వంతు ఆర్థిక సహాయం పదివేల రూపాయలు అందించడం జరిగింది ప్రతి మనిషికి సహాయపడాలని మానవ దృక్తులతో సమాజంలో అందరికీ మంచి మనసు ఇచ్చి ఆలోచన కలిగించాలని ఈ సందర్భంగా పుల్లయ్య గురుస్వామి తెలిపారు.

# కార్మిక హక్కులపై కేంద్రం దాడి..!

- **ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలి**
- **ఆశా వర్కర్ల సమస్యలపై మెడికల్ ఆఫీసర్‌కు సీఐటీయూ వినతిపత్రం**
- **కార్మిక లోకం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలి**

**:- మద్దాల ప్రభాకరరావు**

**మధిర ఆర్సీ, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని, ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మద్దాల ప్రభాకరరావు పిలుపునిచ్చారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ కుమార్కు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ మండల కో-కన్వీనర్ దూదిగం బసవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభాకరరావు మాట్లాడుతూ, కార్మిక వర్గం ఎన్నో దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు.

29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమ హక్కులు, సామాజిక భద్రతను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ విధానాలు కార్మికులను యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితికి నెడుతున్నాయని అన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమంలో ఆశా వర్కర్లు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో నంద్రు సుధారాణి, సంధ్యారాణి, వెంకటరమణ, ఏసుమణి విజయలక్ష్మి, సుజాత, నాగమణి, వై. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
Bhadradrinews Telugu Daily
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
బుధవారం
5 । ఆగస్టు । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

# తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ పోషణ

**–జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్ట్ అధికారి ప్రమీల**




**కామేపల్లి,ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్):** తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ పోషణ అని జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారిణీ ఏ ప్రమీల తెలిపారు. మండలంలోని పండితాపురం రైతు వేదికలో ఐసిడిఎస్ కామేపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సభలో ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు అమ్మ పాలు అమృతం అని అన్నారు.బిడ్డలు పుట్టగానే ప్రతి అమ్మ అందించే మొదటి పౌష్టిక ఆహారం ముర్రు పాలేనని ఆ పాలను పుట్టిన ప్రతి బిడ్డకు తాగించాలని కోరారు.బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని తద్వారా వ్యాధి నిరోధక శక్తి, పెరుగుతుందని తెలిపారు.బిడ్డలకు వయస్సుకు తగిన ఆహారం ఇవ్వడం తోపాటు రెండేళ్లపాటు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని వివరించారు. తల్లిపాల వారోత్సవాలు అధికారిక కార్యక్రమంగా కాకుండా ప్రజల్లో చైతన్య కలిగించే విధంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని అంగన్వాడి కేంద్రాలతో పాటు ఆరోగ్య కేంద్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించొచ్చని అన్నారు.ఈ సభలో కామేపల్లి ప్రాజెక్టు సిడి పిఓ కే ఉమా,మండల వైద్య అధికారిణి డాక్టర్ శ్రీదేవి, కొమ్మినేపల్లి సర్పంచ్ డి అనురాధ,డి ఎం కోఆర్డినేటర్ సమ్రారీన్,కామేపల్లి ప్రాజెక్ట్ సూపర్వైజర్లు టీ విజయలక్ష్మి,పీ లక్ష్మి, బి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, హెల్త్ సూపర్వైజర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో మాట్లాడి గ్రంధాలయ సమస్యలను పరిష్కరిస్తా

**-- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా**





**కామేపల్లి,ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్):** జిల్లా అధికారులతో మాట్లాడి గ్రంథాలయాల సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా వెల్లడించారు. మంగళవారం పండితాపురం, కామేపల్లి గ్రంథాలయాలను ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పండితాపురం గ్రంథాలయ భవనం పురాతన కాలం నుండి కొనసాగుతుందని శిథిలావస్థకు చేరుకుందని కూలిపోయే ప్రమాదం ఉందని కొమ్మినేపల్లి గ్రామ సర్పంచ్ అనురాధ, ఉపసర్పంచ్ మల్లికార్జున్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి శంకర్ గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, ప్రసాద్,మల్లయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వినతి పత్రం అందజేశారు.ఈ గ్రంథాలయాన్ని అప్పుడు దాకా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించాలని వారు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కామేపల్లి గ్రంథాలయం సమస్యలు కూడా పరిష్కరిస్తానని వెల్లడించారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి గ్రంథ పాలకుడు ఎం నవీన్ కుమార్ ప్రజలు,పాఠకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్

**- చిరుముల రాములు కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత**



**కారేపల్లి, ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చిరుముల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ మానవత్వాన్ని చాటుతూ మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిరుముల రాములు దశదిన కార్యక్రమం సందర్భంగా ఆయన భార్య ఎల్లబ్బాయికి రూ.5,000ల ఆర్థిక సహాయాన్ని అందజేసి బాధిత కుటుంబానికి తన వంతు అండగా నిలిచారు. ఈ సందర్భంగా షేక్ గౌసుద్దీన్ మాట్లాడుతూ, చిరుముల రాములు మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని, ఇలాంటి క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆ కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందించిన షేక్ గౌసుద్దీన్‌కు చిరుముల రాములు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డొంకిన రవీందర్ గౌడ్, పాలిక వీరస్వామి, కారేపల్లి మండల బీసీ నాయకుడు వెంకటేశ్వర్లు, యువ నాయకుడు చింతల సంపత్, ఎండీ ఖలీలుల్లా ఖాన్, సోమందుల వెంకటేశ్వర్, బీఆర్ఎస్ మైనార్టీ యువ నాయకుడు షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో బ్లాక్ మనీ మోసం భాగోతం బయటపెట్టిన పోలీసులు

**- రూ.13 లక్షలు వసూలు చేసిన నిందితుడు అరెస్ట్**

**– DSP R. సతీష్ కుమార్, పాల్వంచ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్**




**(భద్రాద్రి న్యూస్ ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ఆగస్టు 4**
అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ మనీ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న పత్తిపాటి ప్రేమ్ చందు అనే నిందితుడిని అశ్వారావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. బ్లాక్ పేపర్లను ప్రత్యేక రసాయన ద్రావణంలో ముంచితే రూ.500 నోట్లుగా మారుతాయని నమ్మించి, అశ్వారావుపేటకు చెందిన మదుబాబు నుండి ముందుగా రూ.11 లక్షలు, అనంతరం రసాయనాల కొనుగోలు పేరుతో మరో రూ.2 లక్షలు తీసుకుని మొత్తం రూ.13 లక్షలు మోసం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుండి మోసానికి ఉపయోగించిన రూ.500 నోట్ల పరిమాణంలో కట్ చేసిన 20,000 బ్లాక్ పేపర్లు (20 కట్టలు), బ్లాక్ పేపర్లను నోట్లుగా మారుస్తామని చెప్పందుకు ఉపయోగించిన 2 రసాయన ద్రావణాల సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను పాల్వంచ ఙూా =. సతీష్ కుమార్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో వెల్లడించారు. నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న వస్తువులను సీజ్ చేసి రిమాండ్ కు తరలించారు. నిందితుడు గతంలో కూడా నకిలీ కరెన్సీ, మోటార్ సైకిల్ దొంగతనం వంటి కేసుల్లో బాచుపల్లి, రామచంద్రపురం మరియు కూకట్పల్లి పోలీస్ స్టేషన్లలో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో తెలిసింది.

# క్వార్టర్ బాటిల్‌పై రూ. 15--30 అదనపు వసూళ్లు..?

- కారేపల్లిలో మద్యం విక్రయాలపై వినియోగదారుల ఆందోళన
- ఆకస్మిక తనిఖీలు చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్
- ఎంఆర్పీ కంటే అధిక ధర చెల్లించొద్దని ప్రజలకు అవగాహన




**కారేపల్లి, ఆగస్టు 4(భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి ప్రాంతంలోని పలు మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై ?15 నుంచి ?30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతిరోజూ మద్యం కొనుగోలు చేసే వినియోగదారులపై అదనపు భారం పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ప్రతి మద్యం సీసాపై గరిష్ఠ చిల్లర ధరను స్పష్టంగా ముద్రించినప్పటికీ, కొన్ని దుకాణాల్లో ఆ ధరకు విక్రయించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒకటి, రెండు దుకాణాలకే పరిమితం కాకుండా పలు చోట్ల ఒకే తరహా పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఆబ్కారీ శాఖ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో క్వార్టర్ బాటిళ్లు విక్రయమవుతున్న నేపథ్యంలో ఒక్కో బాటిల్‌పై ?15 నుంచి ?30 వరకు అదనంగా వసూలు చేస్తే భారీ స్థాయిలో అక్రమ వసూళ్లు జరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**వినియోగదారులకు సూచన**

మద్యం కొనుగోలు చేసిన తర్వాత సీసాపై ముద్రించిన ఎంఆర్పీని పరిశీలించి, అదే ధరను మాత్రమే చెల్లించాలని వినియోగదారులకు సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ఎంఆర్పీ కంటే అధికంగా డబ్బులు కోరితే కారణం ఏమిటని ప్రశ్నించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదని అవగాహన కల్పించాలని కోరుతున్నారు. అవసరమైతే బిల్లు తీసుకుని సంబంధిత ఆబ్కారీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

**చట్టం ఏమి చెబుతోంది?**

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అధికంగా వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం, లైసెన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా రద్దు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కారేపల్లి ప్రాంతంలోని మద్యం దుకాణాలపై ఖమ్మం జిల్లా ఆబ్కారీ శాఖ ప్రత్యేక దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరకే మద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సమస్య తెలిసిన వెంటనే స్పందన..

- భాగ్యనగర్ తండాలో వర్షపు నీటి సమస్యకు పరిష్కారం చూపిన సర్పంచ్ హీరాలాల్
- జేసీబీతో అత్యవసర చర్యలు.. ఇళ్లలోకి చేరిన నీటిని బయటకు మళ్లింపు
- సర్పంచ్ చొరవకు గ్రామస్థుల ప్రశంసలు



**కారేపల్లి, ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్--రాములు):** కారేపల్లి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లే మార్గాలు నీటితో నిండిపోవడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి గ్రామపంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అత్యవసర చర్యల్లో భాగంగా జేసీబీ యంత్రాన్ని రంగంలోకి దించి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టి, చెత్తను తొలగించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టించారు. దీంతో ఇళ్లలోకి చేరిన నీరు బయటకు వెళ్లి బాధితులకు ఉపశమనం లభించింది. సమస్యను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టిన సర్పంచ్ హీరాలాల్‌ను గ్రామస్థులు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ బీక్కులాల్, పంచాయతీ కార్యదర్శి పెంద్ర అనిల్, వార్డు సభ్యులు వాంకుడోత్ గాంధీ, గుగులోత్ భీముడు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై పాలకవర్గ సమీక్ష

**- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నారు : ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**వైరా, ఆగస్టు 4, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై పాలకవర్గం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ కేంద్రంలో ని వైరా మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 45 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని, మంజూరైన నిధులతో మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపడతామని, మున్సిపల్ పాలకవర్గం మున్సిపాలిటీని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని కోరారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైరా మున్సిపాలిటీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అప్పుడే ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు మొండి గోడలుగా మిగిలిపోయాయని విమర్శించారు, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ విద్యుత్ ఆర్ అండ్ బి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొట్టుకుపోయిన డైవర్షన్‌కు మళ్లీ ఊపిరి..!

**- యుద్ధ ప్రాతిపదికన పనులు**

**- 25 గ్రామాల ప్రజలకు త్వరలోనే ఊరట బుధవారానికల్లా రాకపోకలు పునరుద్ధరిస్తామని నిర్మాణ సంస్థ హామీ**






**వాజేడు, ఆగస్టు 4 (భద్రాద్రి న్యూస్):** చీకుపల్లి--పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య 163వ జాతీయ రహదారిపై ఇసుకవాగు వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన సమీపంలోని డైవర్షన్ రోడ్డు భారీ వర్షాల ధాటికి పూర్తిగా కొట్టుకుపోవడంతో దాదాపు 25 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ మధ్య కీలక రాకపోకలకు అంతరాయం ఏర్పడి, ప్రజలు రోజువారీ ప్రయాణాలకు నానా అవస్థలు పడ్డారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న నిర్మాణ సంస్థ ఆలస్యంగా అయినా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టింది. ప్రస్తుతం డైవర్షన్ రోడ్డుపై గ్రావెల్ పరుస్తూ పనులను వేగవంతంగా కొనసాగిస్తోంది. తొలిదశలో కాలినడకన వెళ్లే వారికి, ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనువుగా మార్గాన్ని సిద్ధం చేసింది. అనంతరం నాలుగు చక్రాల వాహనాలు సైతం నిరాటంకంగా ప్రయాణించేలా పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ బుధవారానికల్లా డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పూర్తిచేసి అన్ని వాహనాల రాకపోకలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ రహదారి పునరుద్ధరణతో ప్రత్యామ్నాయ మార్గంపై ఆధారపడిన 25 గ్రామాల ప్రజలకు భారీ ఊరట లభించనుంది. అయితే ప్రతి వర్షానికీ డైవర్షన్ కొట్టుకుపోయే పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపాలని, వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులకు శాశ్వతంగా తెరదించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు

# కాంగ్రెస్ పార్టీ నూతన మండల, పట్టణ అధ్యక్షుల నియామకం





**వైరా, ఆగస్టు 4,( భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన మండల పట్టణ అధ్యక్షులు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రామదాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొని నూతనంగా ఏర్పడ్డ మండల పట్టణ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేయడం జరిగింది. వైరా మండల అధ్యక్షులుగా శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులుగా పేరంశెట్టి సీతారాములు, కొనిజర్ల మండల అధ్యక్షులు సవల్ల నాగేశ్వరరావు, ఏనుకూరు మండల అధ్యక్షులు స్వర్ణ శిరీష, కారేపల్లి మండల అధ్యక్షులు తోటకూర రాంబాబు, తదితరులకు బాధ్యతలు అప్పగించడం జరిగింది.

# వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

- మున్సిపాలిటీ పరిధిలో నీటి పన్ను వసూలు నిలిపివేయాలని కోరుతూ ధర్నా
- మూడేళ్ల పెండింగ్ నీటి బిల్లు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది
- కౌన్సిల్ సమావేశం లేకుండా ఆన్లైన్ బిల్లులు ఇవ్వకుండా మాన్యువల్ బిల్లు ఇవ్వడంపై అభ్యంతరం
- స్పష్టమైన ఆదేశాలు వచ్చేంతవరకు నీటి పన్ను వసూలు చేయొద్దంటూ ధర్నా
- ధర్నాలో పాల్గొన్న కౌన్సిలర్లు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు




**వైరా, ఆగస్టు 4, (భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో గత కొంతకాలంగా వసూలు చేస్తున్న మంచినీటి పనులు బకాయిలు ఎలాంటి తీర్మానం లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లు కట్ట స్వరూప రాణి, తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, కిన్నెర కృష్ణ, మాదినేని సునీత , దుర్గాప్రసాద్, నల్లమోతు శైలజ, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వరరావు లు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడిన దగ్గర నుండి సుమారు ఎనిమిది సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచినీటి పన్నులు వసూలు జరగలేదని, కానీ వైరా మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది మూడు సంవత్సరాల బిల్లును ఒకేసారి వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై అధిక భారం మోపుతున్నారని దీని అరికట్టేందుకు మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని, ఎలాంటి ఆన్లైన్ బిల్లుల ద్వారా బిల్లులు వసూలు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం కౌన్సిల్ తీర్మానం లేకుండా త్రాగునీటి బిల్లులు ఎలా వసూలు చేస్తారని కమిషనర్ను ప్రశ్నించారు దీనికి కమిషనర్ స్పందిస్తూ ఆన్లైన్ బిల్లులు వచ్చేవరకు సిబ్బంది తాగునీటి బిల్లులు వసూలు తాత్కాలికంగా నిలిపివేస్తామని హామీ ఇచ్చారు వారం రోజుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానం ప్రతిపాదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు మద్దెల రవి, అప్పం సురేష్, పట్టణ మహిళా మాజీ అధ్యక్షురాలు సక్కుబాయి, నాయకులు మాదినేని దుర్గాప్రసాద్, నూకల వాసు, పుల్లయ్య, పాసంగులపాటి శివ, బత్తుల రాజు, కొత్త నరసింహారావు, మాచర్ల శంకర్, నరసింహారావు, కట్ట నాగేశ్వరరావు, వేముల శివకృష్ణ, రంజాన్, వదినేపల్లి చక్రవర్తి, గుగులోతు బాలు, వీరన్న, రేచర్ల సైదులు, వల్లెపు రాము, తదితరులు పాల్గొన్నారు